విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ఎమ్మెల్సీ స్థానాలకు 4 నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర-ఏలూరు : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి బుధవారం నాలుగు నామినేషన్‌లు దాఖలయ్యాయి. వై.ఎస్.ఆర్.సిపి తరపున జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, తణుకు కు చెందిన వంకా రవీంద్రనాథ్, వంకా రాజకుమారి, టీడీపీ తరపున వీరవాసరం నకు చెందిన వీరవల్లి చంద్రశేఖర్ తమ నామినేషన్లను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి. అరుణ్ బాబుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ నామినేషన్ సమయంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వర రావు, శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాధరాజు, కొఠారు అబ్బయ్య చౌదరి, ప్రభృతులు ఉన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటివరకు మొత్తం 5 నామినేషన్లు దాఖలు అయ్యాయి. జిల్లా రెవిన్యూ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి ఏ .వి. ఎన్ .ఎస్. మూర్తి, ప్రభృతులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

విశాలాంధ్ర -భీమవరం: డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు యువత నడుంబిగించాలని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ ఏ.టీ.వీ.రవికుమార్ విద్యార్థులను కోరారు. బుధవారం ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగం వలన యువత తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత కూడా తమ దృష్టికి వచ్చిన అంశాలు గాని, తన స్నేహితులు ఎవరైనా మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను పాడు చేసుకుంటే ఆ సమాచారాన్ని రహస్యంగా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని నివారిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపర్డెంట్ పి.భార్గవ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడితే అటువంటి వ్యక్తులకు హెచ్ఐవి, టిబి ఇంకా అత్యంత ప్రమాదకరమైన వ్యాధులు దరిచేరుతున్నాయని తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. వైద్య నిపుణులు కూడా ఇదే అంశాన్ని చెప్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం జగపతి రాజు ఎస్.ఈ.బి సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.వి.వి.వర్మ, డాక్టర్ అరుణ కుమారి, ప్రొఫెసర్ పద్మారావు, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల అదృశ్యం కేసులో ముగ్గురి అరెస్ట్

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెం హైస్కూలులో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఇరువురి బాలికల అదృశ్య సంఘటనపై ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రెడ్డి శ్రీను, కర్రి చెన్నారావులు బాలికలను ప్రలోభపెట్టి తీసుకువెళ్ళారని బాలికల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి వీరిని అరెస్టు చేసి కోర్టుకు పంపారు. వీరికి ఆశ్రయం ఇచ్చిన గుమ్మడి చెన్నారావును అరెస్టు చేశారు. బాలికల అదృశ్యం కేసును 24 గంటల్లో ఎస్ఐ చెన్నారావు, సిబ్బంది చేధించిన సంగతి తెలిసిందే. అరెస్టు అయిన వారిలో కర్రి చెన్నారావు మైనర్ కావటంతో ఇతన్ని జువైనల్ కోర్టులో హాజరుపరిచారు.

రూ. 74 లక్షల విలువైన 735 కిలోల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: వాహన తనిఖీలలో రూ.74 లక్షల విలువైన 735 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పి రాహుల్ దేవ్ శర్మ తెలిపారు. జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం తమకు అందిన సమాచారం మేరకు బుధవారం స్థానిక కలపర్రు టోల్ గేట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఎపి 04 టియు 2770 అను నెంబర్ గల వ్యాన్ లో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన మురళీ బాలకృష్ణన్, తుట్టికుడి కి చెందిన శివ తుని ఏరియాకు వెళ్ళి అక్కడ సన్యాసి రావు ద్వారా ఏజెన్సి నుండి వ్యాన్ లో 735 కేజీల గంజాయిని 21 బస్తాలలో లోడ్ చేసి ఇవ్వగా గంజాయి లోడ్ తో ఉన్న వ్యాను ను శివ చెప్పిన ప్రకారం మొహమ్మాద్ ఆలీ, చెన్నై కు ఇవ్వడానికి తీసుకెళ్తున్నారన్నారు. పోలీసులకు అనుమానం రాకుండా వ్యాన్ వెనుక భాగం కంటైనర్ లో గంజాయిని తరలిస్తుండగా పోలీస్ సిబ్బంది వ్యాన్‌ను స్వాధీనం చేసుకొని గంజాయిని సీజ్ తెలిపారు. ఈ తనిఖీలలో పెదవేగి సీఐ ఎన్. దుర్గాప్రసాద్, ఎస్ఐ బి. నాగబాబు, హెడ్ కానిస్టేబుల్ సువర్ణ రాజు, పెదపాడు పోలీస్ కానిస్టేబుల్ దావాల ప్రదీప్,వి. నరేష్ లు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్ధనలు

విశాలాంధ్ర - లింగపాలెం : క్రైస్తవులు విభూది బుధవారాన్ని పురస్కరించుకుని చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. క్రీస్తు ఏకాంత ప్రార్ధనలు చేసేందుకు వెళ్ళారని బైబిల్‌లో ఉన్న ప్రకారం ఈ రోజు క్రైస్తవులకు పవిత్రమైనదని గురువులు, పాస్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విశ్వాసులు ప్రత్యేక మాలధారణ వేశారు. 40 రోజులపాటు క్రైస్తవులు విందులు, వినోదాలు, శుభకార్యక్రమాలకు దూరంగా ఉంటారు. మాలలు ధరించిన విశ్వాసులు నియమాలు పాటిస్తూ భక్తి ఆరాధనతో జీవిస్తారు. 40 రోజుల తరువాత ధరించిన మాలధారణను తీసి వేస్తారు.

మల్లసముద్రం చెరువులో తవ్వకాలకు అనుమతుల్లేవు

- అక్రమంగా తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు
- ఉన్నతాధికారుల ఆదేశాలతో రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్‌శాఖ సంయుక్తంగా కార్యాచరణ
- విశాలాంధ్ర కధనాలకు స్పందన

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెం మల్లసముద్రం చెరువులో ఎటువంటి తవ్వకాలకు అనుమతి లేదని లింగపాలెం తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ, ఇరిగేషన్ శాఖ డిఇ అర్జునరావు వెల్లడించారు. అధికారులు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఈ చెరువులో తవ్వకాలకు అనుమతులు ఉండవని తెలిపారు. అక్రమంగా తవ్వకాలు చేస్తూ మట్టిని తరలిస్తే వాహనాలు సీజ్ చేసి ఒక్కొక్క వాహనానికి రూ. లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ చెరువు వద్ద 24 గంటలు నిఘా ఉంటుందని, ఇదికాక ప్రత్యేక బృందం తనిఖీ నిర్వహిస్తుందని తెలిపారు. ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేసే చర్యలు తీసుకున్నామని వీరు వెల్లడించారు. ధర్మాజీగూడెంలో జగనన్న ఇళ్ళ నిర్మాణం పూర్తి స్థాయిలో లేదని, కొన్ని ఇళ్ళ నిర్మాణం జరుగుతున్నాయని వీటికి మట్టి కావాల్సి వస్తే మల్లసముద్రం చెరువులో కాకుండా ఇతర ప్రాంతాలలో జిల్లా ఉన్నతాధికారుల అనుమతులు పొందాలని అధికారులు తెలిపారు. మల్లసముద్రం చెరువు అక్రమ తవ్వకాలపై విశాలాంధ్ర వెలుగులోకి తెచ్చిన వరుస కథనాలపై ఉన్నతాధికారులు స్పందించారు. దీనిలో భాగంగా నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈయన ఆదేశాలతో తహశీల్దార్, ఇరిగేషన్ శాఖ డిఇతోపాటు ఎస్ఐ చెన్నారావు, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖ సిబ్బంది బుధవారం చెరువును తనిఖీ చేశారు. చెరువులో జరిగిన అక్రమ తవ్వకాలను పరిశీలించారు. ఇది చూసిన అధికారులు, సిబ్బంది తీవ్రంగా స్పందించారు. చెరువుకట్ట, అలుగుకు కలిగే ప్రమాదాన్ని గుర్తించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ సిబ్బంది ప్రతీరోజూ కాపలా కాస్తారని అధికారులు తెలిపారు. దీనికోసం ఈ మూడు శాఖలకు చెందిన సిబ్బందికి డ్యూటీలు వేశారు.

మాఫియా గ్యాంగ్‌పై చర్యలు

మట్టి మాఫియా గ్యాంగ్ అక్రమ తవ్వకాలకు పాల్పడిన, అరాచకాలు చేసి అలజడులు సృష్టించినా, ఉద్యోగులపై ఒత్తిళ్ళు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ గ్యాంగ్ వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు.

అధికారుల స్పందనపై రైతులు హర్షం

చెరువును కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవటాన్ని రైతులు, ప్రజలు అభినందిస్తున్నారు. ముఖ్యంగా సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తీసుకున్న చర్యలపై వీరు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యలు వల్ల చెరువును కాపాడుకోవచ్చని రైతులు, ప్రజలు అంటున్నారు.

పట్టణ సుందరీకరణపై దృష్టి పెట్టండి : కలెక్టర్

విశాలాంధ్ర-భీమవరం: పట్టణ సుందరీకరణలో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక గుర్తింపుగా నిలవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో సమావేశమై పట్టణ అభివృద్ధి, గ్రీనరీ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్లు వేరే చోటికి బదిలీ అయిన తరువాత కూడా వారి పేరును ప్రజలు గుర్తించుకునేలా పనులు చేపట్టాలన్నారు. నగర సుందరీకరణలో భాగంగా టౌన్ ప్లాన్ అప్రూవ్డ్ లేఅవుట్లు, రోడ్లకు ఇరు పక్కల, నివాస ప్రాంతాలు రోడ్ల పక్కన పెద్ద ఎత్తున మొక్కలు నాటించాలన్నారు. మొక్కలు నాటించడం అనేది మొక్కుబడి కార్యక్రమంగా కాకుండా పచ్చదనం కంటికి కనిపించేలా ఉండాలన్నారు. జిల్లాలోని ప్రతి పట్టణంలో వ్యాపార సముదాయాల ముందు ఆయా వ్యాపారుల భాగస్వామ్యంతో పెవర్ బ్లాక్సను ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాల న్నారు. టిడ్కో గృహ నిర్మాణా లపై సమీక్ష చేస్తూ చని పోయిన, వలస వెళ్లిన, 60 ఏళ్లు పైబడిన వారి స్థానాల్లో అర్హులైన వారి కుటుంబ సభ్యులకు నిబంధనల మేరకు టిడ్కో గృహాలను అందచేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, భీమవరం ఆర్డీవో దాసిరాజు, నరసాపురం, పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, తణుకు, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్లు తదితరులు, పాల్గొన్నారు.

వైవీ రావు మృతి ఆర్టీసీ కార్మిక వర్గానికి తీరనిలోటు

విశాలాంధ్ర -భీమవరం: కామ్రేడ్ వైవీ రావు ఆకస్మిక మరణం ఉద్యోగ కార్మిక వర్గానికి తీరని లోటని ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ కే ఆలీ, రీజనల్ అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. బుధవారం భీమవరంలో రీజినల్ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ వైవి రావు సంతాప సభ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైవి రావు లాంటి కార్మిక నాయకుడు మరొకరు లేరన్నారు. ఎంతో నిబద్ధతతో కార్మిక వర్గానికి సేవలందించిన మహా వ్యక్తి అని కొనియాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ వైవీ రావు సమాజంలో కార్మిక వర్గం కోసం వామపక్ష భావజాలంతో నిరంతరం కార్మికుల కోసమే పాటుపడ్డాడని అన్నారు. సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన అనేక మహాసభలు యూనియన్ నుండి ప్రతినిధులుగా పాల్గొని కార్మికుల గురించి మాట్లాడే వారన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వి రావు మాట్లాడుతూ వైవీ రావు ఒక వ్యక్తి కాదని శక్తి అని నివాళులర్పించారు. యూనియన్ కోసం రాత్రనక పగలనకా ఎంతో కృషి చేసిన వ్యక్తి రావని అన్నారు. ఆర్టీసీ కార్మిక నాయకుడు ఎస్ఎస్ రావు మాట్లాడుతూ ఎక్కడ ఏ ఉద్యమం జరిగినా కార్మికులకు భరోసా ఇచ్చి ముందు ఉండే వారని, అటువంటి వై వి రావు లేకపోవడం ఆర్టీసీ ఉద్యోగులకు తీరనిలోట అన్నారు. సంతాప సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, యూనియన్ జిల్లా నాయకులు అడబాల నరసింహారావు, లలిత కుమారి, భీమవరం నరసాపురం తణుకు తాడేపల్లిగూడెం డిపో కార్యదర్శి తో పాటు పలువురు మాట్లాడారు. ముందుగా చిత్రపటానికి భీమారావు ఎస్వీ రావు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర -భీమవరం: అపరిష్కృత సమస్యల పరిష్కారానికి, న్యాయపరమైన హక్కుల సాధనకై ఉద్యోగులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎ.పి.జెఎసి అమరావతి ఏలూరు జిల్లా చైర్మన్ ఎస్.శివశంకర్ పిలుపునిచ్చారు. ఎ.పి.జెఎసి అమరావతి జిల్లా సమావేశం బుధవారం భీమవరంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను ప్రభుత్వం బిచ్చగాళ్లుగా మార్చేసిందని ధ్వజమెత్తారు. మనం దాచుకున్న సొమ్ము పై ప్రభుత్వం పెత్తనమేమిటని ఆయన ధ్వజమెత్తారు. ఒకటో తేదీన వేతనాలు ఇవ్వడంలేదని దీనితో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఇఎంఐలపై వడ్డీలు, పెనాల్టీ కట్టుకునే దౌర్భాగ్యం వచ్చిందని ఆయన మండిపడ్డారు. 11వ పిఆర్సీ లో అన్యాయం జరిగిందని దీన్ని సవరించి మరో పీఆర్సీ వెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఫణి కుమార్, ఎం.ఆర్కె.ప్రసాదరాజు, జి.సత్యనారాయణ,అవివేకి సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, ఎం.లక్ష్మణబాబు, పి.జె.మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

విన్నకోట మృతికి సంతాపం

విశాలాంధ్ర - పాలకొల్లు: ప్రముఖ కళాకారుడు, నాటక న్యాయ నిర్ణేత , నంది నంది అవార్డు గ్రహీత విన్నకోట వెంకటేశ్వరరావు మృతి పట్ల పాలకొల్లు కళాపరిషత్ కార్యవర్గం తీవ్ర సంతాపం ప్రకటించింది. ఈ సందర్భంగా సంస్థ గౌరవ అధ్యక్షులు మేడికొండ శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ విన్నకోట మృతి కళా రంగం తో పాటు, కార్మిక రంగాన్ని కూడా తీరని లోటని అన్నారు. కార్మిక నాయకునిగా కూడా ఆయన అందించిన సేవలు శాశ్వతంగా నిలిచిపోతాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కళాపరిషత్ అధ్యక్షులు కేవీ కృష్ణ వర్మ మాట్లాడుతూ పాలకొల్లు కళాపరిషత్ వ్యవస్థాపక గౌరవాధ్యక్షులుగా గత 15 సంవత్సరాలుగా సంస్థ నిర్వహణకు వినుకొండ వెంకటేశ్వరరావు అందించిన సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని, వారి సలహాలు, సూచనలతోటే పాలకొల్లు కళాపరిషత్ ముందుకు సాగిందని కొనియాడారు. కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి, వ్యవస్థాపకుడు మానాపురం సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఎక్కడ నాటకోత్సవాలు జరిగినప్పటికీ విన్నకోట న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తూ, రాష్ట్రస్థాయిలో నాటక పరిషత్తులు నిర్వహణలో తన వంతు సహకారాన్ని అందించే వారని, నంది అవార్డు కూడా అందుకున్నారని గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశంలో కళాపరిషత్ సభ్యులు డాక్టర్ కేఎస్పీఎన్ వర్మ, విటాకుల వెంకటరమణ, జక్కంపూడి కుమార్, కొటికలపూడి గుప్తా, కొల్లి కొండ ప్రసాద్, నడపల శ్రీనివాస్, షేక్ పీర్ సాహెబ్, సామంజి శ్రీనివాస్ శాస్త్రి, జిఎస్ఎన్ ఆర్ట్స్ రవి, అంగర కుమార్, రెడ్డి వాసు, దాసరి నాని తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతు చేపట్టండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: మంగపతి దేవి పేట గ్రామంలో ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైందని సంబంధిత అధికారులు, నాయకులు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూడా సహకరించాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మంగపతి దేవి పేట గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో రోడ్లు నిర్మించాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న నాయకులు పేపర్లలో టీవీలలో ప్రకటన చేయడానికి తప్ప వాటిని అమలు చేయడంలో విఫలం చెందారని ప్రభుత్వంపై మండిపడ్డారు. మండలంలో గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీ పరిధిలో గల గ్రామాలలో రహదారులు, డ్రైనేజీ సమస్య ఎక్కువ ఉన్నందున గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఏజెన్సీ గ్రామాల నుండి కొయ్యలగూడెం రావాలంటే మంగపతి దేవి పేట గ్రామం మీదుగానే నిత్యం వందలాది మంది రాకపోకలు కొనసాగిస్తున్నారని మంగపతి దేవి పేట గ్రామంలో ఉన్న ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, గ్రామంలో డ్రైనేజీ సమస్య కూడా ఎక్కువగా ఉన్నందున ఇళ్లల్లో వాడిని నీరు డ్రైనేజీ లేక రోడ్లపైనే ఏరులై పారుతుందని సంబంధిత అధికారులు మంగపతి దేవి పేట గ్రామ అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గుదే శ్రీను, దాసరి సుందరరావు, కట్ట మహేష్, శుక్లబోయిన వెంకటేష్, అగ్గయ్య, జక్కు కొవ్వాడియ్య, బుర్రి బాబి, బి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వరి పండించే రైతులకు న్యాయం చేస్తాం

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కొత్తపల్లి- సరిపల్లి గ్రామాల మధ్యలో ఉన్న దంతుల కుంట పశువుల చెరువు చేపల చెరువులుగా మార్చవద్దని గణపవరం గ్రామానికి చెందిన రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి సభ్యులు, వరి పండించే రైతు రుద్రరాజు వెంకట సూర్యనారాయణ రాజు(ఆర్ వి ఎస్ రాజు) స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు ఈ విషయం పై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే, బుధవారం గణపవరం మండల స్థాయి అధికారులు దంతులు గుంట చెరువును రైతుల సమక్షంలో పరిశీలించినట్లు గణపవరం తహసిల్దార్ సిహెచ్ యువి కృష్ణ స్వామి తెలిపారు.వరి పంట పండించే రైతులకు అన్ని పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణస్వామి మండల వ్యవసాయ అధికారి యర్రం శెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్, మత్స్యశాఖ ఎఫ్ డి ఓ గణేషన్, ఇరిగేషన్ ఏ ఈ (చిలకంపాడు) పెద్దిరాజు, ఐఓపిఆర్ డి పల్లి వెంకట సత్యనారాయణ, తదితర అధికారులు, ఆర్ వి ఎస్ రాజు, రైతులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మలు తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం : మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం, మల్లుకుంట వరకు ఆర్ అండ్ బి రోడ్డు పక్కన ఉన్న చెట్ల కొమ్మలు అక్రమంగా నరికి విక్రయాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. 40 సంవత్సరాల పైబడి రోడ్డుకు ఇరువైపులా ఉన్న మామిడి, మర్రి చెట్లు బాటచారులకు సేద తీర్చుకునేందుకు ఉపయోగపడు తున్నాయి. తిరుమలదేవిపేట ఊరు చివర స్మశానం వద్ద స్థానికులు దహన సంస్కారాలు చేసే సమయంలో ఎండవేళ చెట్టు నీడని కూర్చునేందుకు చెట్లు ఉపయోగకరంగా ఉంటున్నాయి.అక్రమార్కులు విద్యుత్ లైన్లు పేరుతో అక్రమంగా చెట్టుని తొలగించి పెద్దపెద్ద కొమ్మలను పుల్లలకు అమ్మేస్తున్నారు. ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖల అధికారులు కాంట్రాక్టర్లు ఇచ్చే డబ్బులకు ఆశపడి పర్మిషన్ ఇస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఒక పక్కన కరెంటు లైన్ లో ఉన్నచోట చెట్లను తొలగించాలని విద్యుత్తు అధికారుల ద్వారా పర్మిషన్ తెచ్చుకుని కరెంటు తీగలు ఆనకుండా ఉన్న పెద్ద పెద్ద కొమ్మలను కూడా కోత మిషన్‌తో కోసి తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల తిరుమలదేవిపేట స్మశాన వాటికి దగ్గర మామిడి చెట్టు తొలగించే సమయంలో గ్రామస్తులు గొడవ చేసి చెట్లు నరకడం ఆపారు. ఇటీవల కాలంలో రోడ్డు పక్కన మొక్కలు చనిపోయాయన్న కారణంతో 32 మంది ఉపాధి హామీ పథకం ఉద్యోగులను సస్పెండ్ చేశారన్నారు. మొక్కలు చనిపోతే చర్యలు తీసుకున్న అధికారులు చెట్లు అక్రమంగా నరికి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వలస కార్మికుల ప్రయోజనాలకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం : వలస కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు కార్మిక శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కార్మిక శాఖ పరిధిలోని అంశాలపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, బీహార్‌ల నుండి ఎక్కువమంది జిల్లాకు వచ్చి చేపల చెరువులు, ఆక్వా ఇండస్ట్రీస్ తదితర ప్రదేశాల్లో పనిచేస్తున్నారన్నారు. ఇటువంటి వారిపై దృష్టి సారించాలని తెలిపారు. కొంతమంది తక్కువ కాలం పని చేసి వెళ్లడం కూడా జరుగుతుందన్నారు. ఆ సమయంలో అనుకోని సంఘటన జరిగినప్పుడు వారికి ప్రయోజనాలు కల్పించడంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వలస కార్మికులను తీసుకు వచ్చేందుకు ఎంతమంది యజమానులు రిజిస్టర్ అయ్యారు, వారు పనివారిని ఎవరికి పంపుతున్నారు, వారికి కల్పిస్తున్న మౌలిక వసతులపై డేటాను క్రోడీకరించాలన్నారు.బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రతి మండలానికి సుమారు 25 మందిని గుర్తించి గృహ నిర్మాణ శాఖకు జాబితాను అందజేయాలని కలెక్టర్ కార్మిక శాఖ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, కార్మిక శాఖ ఇన్చార్జి డిప్యూటీ కమిషనర్ కుమారి ఆలోచన, అసిస్టెంట్ కమిషనర్ ఎ.లక్ష్మి, గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి పిడి జి. పిచ్చయ్య, సహాయ కార్మిక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వంక రవీంద్రనాథ్ నామినేషన్

విశాలాంధ్ర - ఏలూరు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసీపీ తరపున ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ వంక రవీంద్రనాథ్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. రవీంద్రనాథ్ తన నామినేషన్ పత్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి అరుణ్ బాబుకు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, దెందులూరు, ఆచంట శాసనసభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

విశాలాంధ్ర-ఉంగుటూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉంగుటూరు మండలంలో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈఓ లక్ష్మీనారాయణ అన్నారు. ఉంగుటూరు ఎంపీడీవో కార్యాల యంలో బుధవారం ప్రధానోపాధ్యా యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులు, మధ్యాహ్న భోజనాలు, బై జ్యూస్ కార్యక్రమం పై సమీక్షించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు రాగి జావ తయారీలో శిక్షణ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులకు రాగి జావ తయారీలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించి తల్లిదండ్రుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో నాగూర్ సాహెబ్, పద్మావతి, భాస్కరరావు, ప్రసాద్ రాజు ప్రేమ్ కుమార్, సి.ఆర్.పిలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైస్తవ సోదరుల ఉపవాస దీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: క్రైస్తవ సోదరుల ఉపవాస దీక్షలు బుధవారం ప్రారంభమైన సందర్భంగా కొయ్యగూడెం మండలం గవరవరం ఆర్ సి ఎం విచారణ పరిధిలో వివిధ గ్రామాలలో ఉన్న క్రైస్తవ సోదరులు150 మంది గవరవరం విచారణ గురువు ఫాదర్ శౌరి ఆధ్వర్యంలో క్రైస్తవమాలను ధరించారు. 40 రోజులపాటు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపడతామని 41వ రోజు ఈ దీక్షను విరమించుకోవడం జరుగుతుందని ఆర్.సి.యం విచారణ పరిధిలో గల వివిధ గ్రామాలలో ప్రత్యేక ప్రార్ధనలు, సిలువ జ్ఞానాలు, నిర్వహించడం జరుగుతుందని ఫాదర్ శౌరి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపర్లు సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

గుండుగోలనులో రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - భీమడోలు : గుండుగొలనులోని గాయత్రి ట్రేడర్స్ రైసు మిల్లులో దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసిన 36.50 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్ పి కరణం కుమార్ తెలిపారు. మిల్లుకు రేషన్ బియ్యం వస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు డీఎస్ పి వెంకటేశ్వరరావు, సీఐ యూజే విల్సన్, ఎస్ ఐ లు నాగరాజు, రంజిత్ కుమార్, సిబ్బంది నిఘా వేసి రేషన్ బియ్యం పట్టుకున్నామని ఎస్పి తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ఎంతో శ్రమతో పేదల ఆకలి తీర్చడానికి తక్కువ ధరకు అందిస్తున్న బియ్యాన్ని దళారు లకు అమ్మవద్దని లబ్ధిదారులకు ఎస్‌పి సూచించారు. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చేసేవారికి సంబంధించిన సమాచారం తెలియచేస్తే చర్యలు తీసుకుంటామని పిలుపునిచ్చారు.

పౌరుషానికి ప్రతీకగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : రాయలసీమ పౌరుషానికి ప్రతీకగా బ్రిటీష్ వారిని ఎదురించిన మగ ధీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని డాక్టర్ వై.యస్.ఆర్. హార్టీకల్చరల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ టి. జానకిరామ్ అన్నారు. బుధవారం వెంకట్రామన్న గూడెంలోని హార్టీకల్చరల్ యూనివర్శిటీలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ జానకిరామ్ మాట్లాడుతూ ఇంగ్లాండుకు చెందిన ఈస్ట్ ఇండియా కంపెనీ, బ్రిటీష్ పాలకులను ఎదురించి తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలిపిన నరసింహారెడ్డి జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నరసింహారెడ్డి లాంటి వీరులు పోరాటం ఫలితంగా బ్రిటీష్ వారు భయపడే పరిస్థితి ఆనాడు నెలకొందన్నారు. నరసింహారెడ్డి పేరును రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి సినిమాలు తీయడం, ఓర్వకల్లు విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్.బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ సలోమి సునీత, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ డి.వెంకటస్వామి, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీయల్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె. ధనుంజయరావు, డీన్ ఆఫ్ హార్టీకల్చరల్ పద్మావతమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24న వినియోగదారుల అవగాహన సదస్సు

విశాలాంధ్ర-ఏలూరు: ఈనెల 24వ తేదీన తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24వ తేదీన ఉదయం 10 గంటలకు ఆర్ఆర్ పేట విద్యుత్ భవనంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సిజిఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి. సత్యనారాయణ, ఈఈ టి. శశిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లులలో సమస్యలు, కొత్త సర్వీసులు జారీలో జాప్యం, బిల్లులో పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు తదితర ఫిర్యాదులు అందించ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు హరిబాబు,పి. శ్రీనివాస్, బాలాజీ, ప్రసాద్ పాండే తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే పోటీ పరీక్షలలో విజయం

విశాలాంధ్ర - ఏలూరు : నారాయణపురం శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విశ్లేషణ నైపుణ్యాలపై ఒకరోజు కార్యశాల నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విశ్లేషణ నైపుణ్యాల ద్వారా అనేక సమస్యలకు పరిష్కార మార్గాలు కనుక్కోవచ్చని అన్నారు. కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి.బాబురావు మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చు కోవడానికి ఇటువంటి నైపుణ్యాలు ఎంతో అవసరం అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయవాడ పి.బి సిద్ధార్థ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు శ్యాం బాబు మాట్లాడుతూ సాఫ్ట్వేర్ రంగంలో, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే విశ్లేషణ నైపుణ్యాలు ఎంతో అవసరమని తెలియజేసి విద్యార్థులకు వాటిలో గల మెళకువలను, నైపుణ్యాలను సాధించడంలో పాటించాల్సినటువంటి పద్ధతులను వివరణాత్మకంగా తెలిపి విద్యార్థుల చేత సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో శ్రీ డి రెడ్డయ్య ,డాక్టర్ కొండా రవి తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

24న జాన్ గూటెన్ బర్గ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : ఈ నెల 24వ తేదీన బి.వి.ఆర్. కళాకేంద్రంలో ప్రింటర్స్ డే సందర్భంగా అచ్చు యంత్రం పితామహుడు జోహన్నెస్ గూటెన్ బర్గ్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నామని తాడేపల్లిగూడెం మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వర్రి సత్యనారాయణ, నేదూరి స్వామిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూటెన్ బర్గ్ జయంతి సందర్భంగా బి.వి.ఆర్. కళాకేంద్రం నుండి పడాల వృద్ధాశ్రమం వరకు బైక్ ర్యాలీ నిర్వహించను న్నట్టు తెలిపారు. అనంతరం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం పండ్లు పంపిణీ చేస్తామన్నారు. ఏళ్ళతరబడి వృత్తిమీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న ప్రింటింగ్ ప్రెస్ సభ్యులకు సన్మానం నిర్వహిస్తామన్నారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, సిబ్బంది, సభ్యులు అందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛందంగా సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి అసోసియేషన్ ఐక్యతను చాటుకోవాలని కోరారు.

కన్నెగంటి నివాళి కార్యక్రమాలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పుల్లరి ఉద్యమ కారుడు కన్నెగంటి హనుమంతు జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కాపు సేవ సంఘం పేర్కొంది. గుంటూరు జిల్లాకు కన్నెగంటి హనుమంతు జిల్లాగా నామకరణం చేయాలని కాపు సంక్షేమ సేన డిమాండ్ చేసింది. కన్నెగంటి హనుమంతు నివాళి కార్యక్రమం బుధవారం గణేష్ సెంటర్లో కాపునేత చోడిపిండి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ ప్రేరణతో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిర్వహించడంతోపాటు నాటి గుంటూరు జిల్లా పల్నాడు లో పుల్లరి ఉద్యమాన్ని ధీరోధాతంగా నిర్వహించి బ్రిటిష్ పాలకుల గుండెల్లో గుబులు పుట్టించారన్నారు. విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు సైతం తనకు కన్నెగంటి హనుమంతు స్ఫూర్తిగా నిలిచినట్లు స్వాతంత్రోద్యమ చరిత్రలో పేర్కొన్నారని, అటువంటి మహనీయుని ప్రజలు స్మరించుకునేలా ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా కన్నెగంటి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కాపు సంఘం నేతలు మేకల అన్నవరం, దుగ్గిన శ్రీను, సంకు మధు, సంకుకొండ, ఐవి అప్పారావు, మేడిన కన్నయ్య, కూచి మంచి శ్రీనివాస్ నాయుడు, నక్కా బాబి, సింగలూరి సాగర్ బాబు, వీరాస్వామి, నాని, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో నాసా ప్రాజెక్టు ఆవిష్కరణ

విశాలాంధ్ర -ఏలూరు : స్థానిక బాలాజీ నగర్ శ్రీ చైతన్య పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మంత్రి సత్య నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు తయారుచేసిన నాసా ప్రాజెక్టులను ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అద్భుత ప్రగతిని ప్రతిభను కనపరచిన విద్యార్థులను శ్రీకాంత్ అభినందించారు. మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ప్రావీణ్యత సంపాదించాలని కోరారు.ఈ కార్యక్ర మంలో డీన్, ప్రీప్రైమరీ, ప్రైమరీ ఇన్చార్జులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర,సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్షల మెటీరియల్ అందజేత

విశాలాంధ్ర - గోపాలపురం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు,ఆ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఆంగ్ల అధ్యాపకులు, ఈడూరి గంగరాజు తన సొంత ఖర్చులతో విద్యార్థిని, విద్యార్థు లకు",స్టడీ మెటీరియల్" వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు పి.రఫిక్ అహ్మద్,మిగిలిన అధ్యాపక సిబ్బంది,ఆంగ్ల అధ్యాపకులు ఈడూరి గంగరాజును ప్రత్యేకంగా అభినందించారు. సొంత లాభం కొంత మానుకొని పొరుగు వారికి సహాయపడటం అనేది అధ్యాపకులు ఈడూరి గంగరాజు అక్షరాల ఆచరణ రూపంలో పాటిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు లెక్చరర్ డాక్టర్, గోవాడ జాన్ పీటర్ జి. నిర్మల కుమారి (చరిత్ర) అధ్యాపకురాలు,పి.రత్న కుమారి (అర్థశాస్త్రం) ఎం.వీ.డీ, భవాని,(రాజనీతి శాస్త్రం) అప్పారావు (భౌతిక శాస్త్రం) కే.అప్పాజీ,దుర్గ, విద్యార్థిని,విద్యార్థులు" ఆంగ్ల మెటీరియల్" పంపిణీలో పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీడీపీ కొయ్యలగూడెం మండల ఉపాధ్యక్షుడు నిమ్మగడ్డ రవీంద్రనాథ్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలో సరిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు కంకిపాటి బాబురావు ఆధ్వర్యంలో సరిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలలొ ఓటర్లు 3,300 మంది ఉండగా, మండల ఇన్చార్జి నిమ్మగడ్డ రవీంద్రనాథ్ పర్యవేక్షణలో 33 మంది సెక్షన్ ఇన్చార్జిలను ఏర్పాటు చేసినట్టు బాబురావు తెలిపారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి చంద్రబాబుని మరలా రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమించుకోవడానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని, పార్టీ విజయానికి నాయకులు కార్యకర్తలు ఒక సైనికుడిలా పని చేయాలని రవీంద్రనాథ్ సెక్షన్ ఇన్చార్జిలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జి పారేపల్లి సరేష్, తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మ సేవలో జయమంగళ

విశాలాంధ్ర-మండవల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న వేమవరంలోని కొండాలమ్మ తల్లిని కైకలూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జయమంగళ వెంకటరమణ బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తొలుత ఆలయ పెద్దలు జయమంగళకు ఘనస్వాగతం పలికారు.పర్యటనలో జయమంగళ అభిమానులు పాల్గొన్నారు.

ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకుంటేనే ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : గ్రామాల్లోని రైతులు రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్ళి ఈ క్రాప్, ఈ.కె.వై.సి. చేయించుకుంటేనే వచ్చే వరి పంట కు సంబంధించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయ అధికారి ఆర్.ఎస్.ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టింపాలెం, వీరంపాలెం, జగన్నాధపురం గ్రామాల్లో జరుగుతున్న ఈ క్రాఫ్, ఈ.కె.వై.సి. నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో నూటికి నూరు శాతం ఈ క్రాప్ నమోదు పూర్తయ్యిందన్నారు. ఈ.కె.వై.సి. 95 శాతం మాత్రమే పూర్తయ్యిందన్నారు. మిగిలిన 5 శాతం ఈ నెల 25 లోపు పూర్తి ఈ.కె.వై.సి. పూర్తి చేయించుకోవాలని రైతులకు సూచించారు. రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్ళి రైతులు వేలిముద్రలు వేయాలని తెలిపారు. ఈ క్రాప్, ఈ.కె.వై.సి. సక్రమ ంగా పూర్తయితేనే ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులకు సంబంధిం చిన ఫోన్ నెంబరు కు ఆధార్ లింకు అయి ఉండాలని సూచించారు. ఈ.కె.వై.సి. పూర్తికాని రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్ళి అగ్రికల్చరల్ అసిస్టెంట్లను కలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా నాన్ లోకల్ వ్యక్తి వద్దు ? లోకల్ వ్యక్తి ముద్దు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థిగా నాన్ లోకల్ అభ్యర్థిని నియ మించవద్దని స్థానికులనే నియమించాలని టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాసరావు అన్నారు. గుర్వాయిగుడెంలోని మండల టిడిపి కార్యాలయంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గానికి ఎమ్మెల్యే టిక్కెట్ ఆశిస్తున్న వారిలో నాన్ లోకల్ నుండి వస్తున్న వ్యక్తులకు చింతలపూడి నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యలు అంతగా తెలియదన్నారు. గ్రామాల్లో,వార్డుల్లో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న స్థానిక నాయకులు,కార్యకర్తలు వారికి తెలియకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో పుట్టి, పెరిగి ఇక్కడ రేషన్ కార్డ్,ఆధార్ కార్డు కలిగి,నియోజకవర్గ సమస్యలు,పరిస్థితి తెలిసిన లోకల్ అభ్యర్థికే ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం టికెట్ ను ఖరారు చేయాలని పార్టీ అధిష్టానానికి తెలియచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బొబ్బర రాజ్ పాల్ కుమార్,రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి పాతూరి అంబేద్కర్,రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి పగడం సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు లక్కవరం విద్యార్థి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కి జంగారెడ్డి గూడెం మండలం లక్కవరం లోని శ్రీ రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి విద్యార్థి పోతన మహేష్ ఎన్నికయ్యాడు.ఈ నెల 20,21వ తేదీల్లో ఏలూరు లోని కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలలో సాఫ్ట్వేర్ యాప్స్ విభాగంలో పోతన మహేష్ ప్రథమ స్థానం సాధించాడు. ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొననున్నాడు. రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ కు ఎంపికైన విద్యార్థికి ఎంపీపీ కొదమ జ్యోతి,లక్కవరం గ్రామ సర్పంచ్ గే గెల్లా వెంకటరమణ, ఎంపీటీసీ వెంకట మోహన్ రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చిల్లా దుర్గారెడ్డి ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు టి .ఆనంద్ కుమార్ ఉపాధ్యాయ సిబ్బంది తోపాటు పలువురు మహేష్ కు అభినందనలు తెలిపారు.

ప్రారంభమైన క్రైస్తవుల ఉపవాస దీక్షలు

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: క్రైస్తవ లోకానికి అత్యంత పవిత్రమైన కాలం లెంట్ అని పాస్టర్ కె.ఐజక్ జాన్ తెలిపారు. మండల పరిధిలోని కనసానపల్లి పరిశుద్ధ పౌలు సిఎస్ఐ చర్చిలో బుధవారం క్రైస్తవ ఉపవాస ప్రార్ధనలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ లెంట్ లోని ప్రారంభ దినం బుధవారం నుంచి ఈస్టర్ ముందు రోజు వరకు 40 రోజుల మండల కాలములో క్రైస్తవులు ఉపవాసం ఉండే రోజులు అని తెలిపారు. క్రీస్తు లోక రక్షణార్థమై శ్రమ పొందిన ఈ దినాల్లో ప్రభువు సిలువ శ్రమలను ఉపవాసం ఉండి ధ్యానించుట మంచిది అని తెలిపారు. క్రైస్తవులు ఈ 40 రోజులను గొప్ప సదవకాశం గా భావించి పవిత్ర ఉపవాస ప్రార్థనల్లో పాల్గొని ఆత్మీయ మేలులు, ఆత్మీయ బలం పొందాలని కోరారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సంఘస్తులు విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-భీమవరం టౌన్: ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని భీమవరం డివిజన్ ఖాజీగా నియమితులైన మొహమ్మద్ మొయిజి ఆలం ఫైజీకి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సూచించారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఫైజికి నియామక ఉత్తర్వులను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం సున్ని జామియా మస్జిద్ ఫేస్ ఇమామ్ ఫైజీని ఖాజీగా ప్రభుత్వం నియమించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటీ నాయకులు షేక్ రబ్బాని, షేక్ అన్సారీ, షేక్ ఇమామ్ మోహిద్దిన్, ఎండి అస్లాం పాషా, ఎస్డి బాజీ, ఎస్.కె ముజాహిద్, ఎండి నిజాముద్దీన్ ,ఎండి సలీం, ఎండి షంషుద్దీన్, ఎండి గౌస్ మొహిద్దిన్, సయ్యద్ బాజీ, అజీజుర్ రెహమాన్, ఎండి ఇబ్రహీం, ఎండి వజీర్, అబ్దుల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-పెదపాడు: మండలంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక నర్రా ఆంజనేయులు భవనంలో సిపిఎం మండల సమావేశాన్ని ఆపార్టీ సీనియర్ నాయకులు లింగం కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని పలు ప్రజా సమస్యలను చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఇల్లు నిర్మాణం కోసం లబ్ధిదారుడికి ఇస్తున్న రూ. 1లక్ష 80 వేలు ఏమూలాలకు సరిపోవడంలేదని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. లేకుంటే ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. అర్హులైన వారందరికీ కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. .ఈ సమావేశంలో గుండపనేని సురేష్, పిట్టా రహేల్, ముసునూరి కొండలరావు, రెడ్డి లక్ష్మణరావు, జాన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం మండలం సిఐటియు అనుబంధ సంఘాల ప్రజా సంఘాల ముఖ్య నాయకులు సమావేశం అమలాపురం ఎంప్లాయిస్ హోమ్ వద్ద భువనేశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి జి దుర్గాప్రసాద్ ప్రతినిధిగా హాజరయ్యి ఈ మధ్యకాలంలో కార్మిక వర్గం పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడి ఏ విధంగా జరుగుతుందో వివరించారు. 2023-24 ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక వర్గానికి ఎటువంటి నిధులు కేటాయించకపోవడం, కార్మిక వర్గం పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్నటువంటి శ్రద్ధ ఏ విధంగా ఉన్నదో రుజువైందని అన్నారు. ఏప్రిల్ 3వ తేదీన క్యాంప్ ప్రభుత్వ విధానాలు వ్యతిరేకిస్తూ చలో ఢిల్లీ సీట్ యు ఆల్ ఇండియా పిలుపునిచ్చారని ఆ పిలుపును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మార్చి 4వ తేదీన అమలాపురం సిఐటియు మండల మహాసభ ఎంప్లాయిస్ హోం వద్ద మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ, అంగన్వాడి, మిడ్డే మిల్, బేవరేజ్ హమాలి, బిల్డింగ్ కార్మికులు సంఘాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు, సువర్ణ, బి మణిమాల, కుడుపూడి దుర్గ, డి ఆదిలక్ష్మి, కెవివి సత్యనారాయణ మల్లేశ్వరరావు, భీమల్ శీను, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కవల పిల్లల దినోత్సవం

విశాలాంధ్ర-తణుకు: స్థానిక మాంటిస్సోరి స్కూలులో బుధవారం కవలపిల్లల దినోత్సవం (ట్విన్స్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల లోని కవలల విద్యార్థిని, విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు పూల గుచ్చములు అందించి స్వీట్స్ పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22 వ తేదీన కవలల దినోత్యవం కళాశాలనందు ఘనంగా నిర్వహిస్తునామని అన్నారు. విద్యార్దులు ఎంతో అభివృద్ధిలోనికి రావాలని, సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని మనసారా ఆశీర్వదించారు.

పాఠశాలల విలీనానికి అధికారుల కసరత్తు

విశాలాంధ్ర-కూచిపూడి : పదిమందిలోపు విద్యార్థులు ఉన్న ఎంపీ ఎలిమెంటరీ పాఠశా లలను కిలోమీటర్ దూరంలోపు ఉండే పాఠశాలలో విలీనపరచడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో మండల స్థాయి విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాల వివరాలు సేకరించి సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. మొవ్వ మండలంలో 1,2 తరగతులలో పదిమంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్న పాఠశాలలను గుర్తించి జిల్లా విద్యాశాఖకు తెలిపారు. వివరాల ప్రకారం మండల పరిషత్ పాలనలోని ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలల వివరాలు ఇవే.... మొవ్వ జె.జె.నగర్ లో7గురు, మొవ్వ (పిహెచ్‌డబ్ల్యు) అంబేద్కర్‌నగర్లో 4, నిడుమోలు లాకు పాఠశాలలో 4, నిడుమోలు శివారు వీరాయలంకలో 5, చిన ముత్తేవి రెగ్యులర్ పాఠశాలలో 4, పద్దరాయుడు తోటలో 9 మంది, కాజశివారు మట్ల మాలపల్లి ఎలిమెంటరీ పాఠశాలలో 7, అవురుపూడి(ఏ ఏ) పాఠశాలలో 4 విద్యార్థులు గల వివరాలను వాటికి సమీపంలోని పాఠశాలల వివరాలు అందజేశారు. నిడుమోలు శివారు వీరాయిలంక, కాజ శివారు మట్ల మాలపల్లి, పద్దరాయుడు తోట ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలు విలీనం అయ్యే హైస్కూల్‌కు 3 నుంచి 6 కిలోమీటర్ల దూరం వరకు ఉండటంతో భవిష్యత్తు ప్రణాళిక ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని భావిస్తున్నట్టు సమాచారం. కాగా సరిపడా విద్యార్థులు లేరనే నెపంతో ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు, వామపక్ష పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పోలీస్ వ్యవస్థను వైసీపీలో విలీనం చేశారు

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్రంలో వైసీపీలో పోలీస్ వ్యవస్థను విలీనం చేశారా అన్న అనుమానం కలుగుతుందని మాజీ ఎంపీ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. బుధవారం అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులో సమావేశంలో కొనకళ్ళ మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంసకర అరాచకపాలన కొనసాగుతుందని అన్నారు. సోమవారం గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని వైసిపి అల్లరి ముకలు ధ్వంసం చేసిన నేపథ్యంలో దాడికి పాల్పడిన వారిని వదిలేసి దాడి చేశారని పోలీసులకు పిర్యాదు చేయడానికి వెళ్ళిన తెలుగుదేశం పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. ఇంతవరకు దాడికి పాల్పడిన వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని, గన్నవరం టీ.డి.పి కార్యాలయంపై అసలు దాడి జరిగిందా లేదా అనేది పోలీసులు చెప్పాలని ఆయన కోరారు. దాడి చేసిన వారిపై కేసు పెట్టి అరెస్టు చేయకపోగా ప్రజాస్వామ్యాన్ని మంటకలిపేలా నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో వై.సి.పి నేతలు కొడాలి నాని, వల్లభనేని వంశీల కంటే అభ్యంతరకర వ్యాక్యలు చేసేవారు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. ఇవన్నీ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు అని రానున్న ఎన్నికలలో ప్రజలు ఓటు రూపంలో తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ సమావేశంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, జిల్లా పార్టీ మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మాజీ ఎం.పి.పి బి.వి.ఎస్ కనకదుర్గ, కనకదుర్గమ్మ ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యురాలు విశ్వనాధపల్లి పాప తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర- వీరవాసరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియాను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు వీరవాసరం మండలానికి సంబంధించి సోషల్ మీడియా కన్వీనర్, కో కన్వీనర్లుగా నియమితులైన వారు స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నా రని, అంతేకాకుండా నవరత్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అమలు చేస్తూ ప్రతి కుటుంబం కూడా ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వీరవాసరం మండల కన్వీనర్ ఆదిరెడ్డి వెంకట అప్పారావు, కో కన్వీనర్లు పేరాబత్తుల రవికిరణ్, పాలా నాగరాజు, ఈతకోట నాగేంద్ర వర్మ, ఇంటి రఘు తదితరులు పాల్గొన్నారు.

ఫెమినా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం

విశాలాంధ్ర - పాలకొల్లు: వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు, పాలకొల్లు లయన్స్ క్లబ్ ఫెమినా సంయుక్త ఆర్థిక సహకారంతో విజయవాడ మణిపాల్ హాస్పిటల్స్ నిర్వహణలో బుధవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం, ఉల్లంపర్రు మాంటిసోరి స్కూల్ ప్రాంగణంలో జరిగింది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) చేతుల మీదుగా ఈ శిబిరాన్ని ప్రారంభించారు. క్యాన్సర్ ఫౌండేషన్, తమ మొబైల్ యూనిట్ తో వచ్చి, మహిళలకు బ్రెస్ట్, గర్భాశయ ముఖ ద్వారమునకు సంబంధించిన పరీక్షలు చేసారు. ఈ శిబిరంలో 300 మంది కి పైగా పరీక్షలు చేయించుకున్నారు. మామోగ్రఫీ, ప్యాప్ స్మియర్, ఈసీజీ, ర్యాండమ్ బ్లడ్ షుగర్, బీపీ, జనరల్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మమోగ్రఫీలో 60 మంది ప్యాప్ స్మియర్ 80 మంది ప్రత్యేక టెస్టులు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి. బుద్దరాజు, పాలకొల్లు ఫెమినా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్. వసంత లక్ష్మి, సెక్రటరీ ఆర్ .మీనా మణిదీప్తి, ట్రెజరర్ వి.చైతన్య, పాల్గొన్నారు. ఇంతటి మహత్తరమైన సేవా కార్యక్రమానికి వేదిక ఇచ్చి ప్రోత్సహించిన మాంటిసోరి విద్యాసంస్థల అధినేతలు సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, డాక్టర్ సబిత ఉమెన్స్ జూనియర్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దాల వాసు లకు పాలకొల్లు లయన్స్ ఫెమినా క్లబ్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

జాతీయ స్థాయికి యలమర్రు విద్యార్థులు

విశాలాంధ్ర-పెదపారుపూడి : 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో విశాఖపట్నం జిల్లా, భీముని పట్నంలో జరిగిన 14 సంవత్సరం లోపు ఖోఖో బాలికల, బాలుర విభా గంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీ లలో యలమర్రు జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు టి. నరేంద్రబాబు 9వ తరగతి బాలుర విభాగంలో, జి. అనిత ఏడవ తరగతి బాలికల విభాగములో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనరని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావెళ్ల వరుణ కుమార్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ పోటీలలో నలుగురు బాలికలు, ఇద్దరు బాలురు రాష్ట్రస్థాయి పోటీలలో ప్రశంసా పత్రాలు అందుకున్నారని ఆయన వివరించారు. ఈ విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు పి ఎస్. సోమేశ్వరరావును, విద్యార్థులను, ఉపాధ్యాయులు పి.సత్యనారాయణ, వి. సాంబశివరావు, పి. అంబేద్కర్, వి. పద్మావతి, బి ఎస్. మల్లేశ్వరరావు, ఎస్. కరుణ కుమార్, తదితరులు అభినందించారు.

దేశ సేవలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ముందుండాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దేశసేవలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ముందుండా లని విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం భవానీపురం లోని నేతాజీ హైస్కూల్‌లో వరల్డ్ స్కౌట్స్ అండ్ గైడ్స్ థింకింగ్ డే సెలబ్రేషన్స్ నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం స్కౌట్స్అండ్ గైడ్స్ ఫౌండర్ రాబర్ట్ స్టీవెన్ సన్ స్మిత్ బెడెన్ పవెల్, ఆయన సతీమణి రీటా స్మిత్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మేయర్ కు స్కూల్ ప్రిన్సిపల్ కే.అరుణకుమారి పూల మొక్కను బహుకరించారు. మేయర్ మాట్లాడుతూ విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విభాగాల్లో చేరి సోషల్ సర్వీస్ కార్యక్రమాల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి సేవలు అందించాలని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ స్టేట్ కమిషనర్ డి. ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచాన్ని శాంతియుతంగా ఉంచేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని చెప్పారు. ఆపదలో ఉన్న వారిని, తోటి వారిని ఆదుకోవడమే స్కౌట్స్, గైడ్స్ లక్ష్యమని ఆయన అన్నారు విద్యార్థి దశలోనే స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరడం వలన క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని దేశానికి సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన నేతాజీ హై స్కూల్ చైర్మన్ కె. తిరుపతిరెడ్డిని ఆయన అభినందించారు. నేతాజీ హై స్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన రాజ పురస్కారం అవార్డుకు ఎంపిక అయ్యారని ,త్వరలోనే రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటారని ఆయన వివరించారు. ప్రముఖ న్యాయవాది బాయన హేరంబకుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఏపీబిఎస్ జి ప్రముఖులు కెపిఆర్ బి.శర్మ, డి ఎల్, నారాయణ, ఇండియన్ నేవీ అవార్డు గ్రహీత షేక్ మస్తాన్, రిటైర్డ్ ఆర్మీ అధికారి కేకే. నరసింహారావు, వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నాయకులు ఎస్కే అబ్దుల్ కరీం, నేతాజీ హైస్కూల్ డైరెక్టర్లు కే. రాజేష్, కే .దినేష్ తదితరులు పాల్గొన్నారు.